క్లుప్తంగా

డీఈఓను కలిసిన అపుస్మా నాయకులు



డీఎస్ఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అపుస్మా నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు ఏలూరు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కరించాలని కోరారు. డీఎస్ఈఓను కలిసిన వారిలో అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, గౌరవ సలహాదారు కోనేరు సురేష్ బాబు, ఏలూరు జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.చంద్రశేఖరరావు, ఎస్ఎస్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారి కె.వినోద్, జిల్లా కోశాధికారి జి. రవిశంకర్ కార్యవర్గ సభ్యులు ఎల్. గిరిబాబు ఉన్నారు.

స్వీపర్ల జీతాలు చెల్లించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరపాలక సంస్థ స్కూల్ స్వీపర్లకు రావాల్సిన నాలుగు నెలల జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ స్కూల్ స్వీపర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, యూనియన్ నాయకులు జె.స్వాతి, ఎస్. భాస్కర రావు, చలమల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఏలూరు టౌన్: వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం భోగోలు గ్రామానికి చెందిన మంగతాయారు (45) ఫిబ్రవరి 27న ఏలూరులో కలెక్టరేట్‌లో ఒక పని నిమిత్తం వచ్చింది. ఆమె ఇంటికి వెళ్లేందుకు కొత్తబస్టాండ్‌కు వెళ్లి కనిపించకుండా పోయింది. ఆమె బంధువులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.

అమ్మవారి చీరల వేలం ఆదాయం రూ.74 వేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పత్తేబాద నాలుగు గుడుల సెంటర్‌లోని కనకదుర్గమ్మ దేవస్థానంలో భక్తులు సమర్పించిన చీరలు, రవికల ముక్కలను బుధవారం వేలం వేశారు. తద్వారా రూ.74,130 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకర రావు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ నరసింహారావు, కార్పొరేట్ పోతార్లంక లక్ష్మణరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బీహెచ్ రామనాగ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక భరోసా

- 2621 మంది సాగుదారులకు రూ.1.74 కోట్ల సాయం
- కొత్తగా 390 మందికి లబ్ధి



పోణంగిలో ఎరువులు కొనుగోలు చేసిన రైతులు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల వ్యవసాయం లాభసాటిగా మారింది. సాగు సమయానికే రైతుల ఖాతాల్లో పథకాల నగదు నేరుగా జమవుతోంది. రైతులు సొంతూరులోనే ఆర్బీకేకు వెళ్లి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రబీ సాగు సమయంలో ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా నగదు సాయం అందించడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు మండలంలో 6,223 ఎకరాల్లో రైతులు వరి, అపరాల సాగు చేస్తున్నారు.

రూ.1.74 కోట్ల జమ

రైతుల ఖాతాల్లో ప్రభుత్వం మరోసారి మంగళవారం ఆర్థిక సాయం జమ చేసింది. వెంకటాపురం, చొదిమెళ్ల, తంగెళ్లమూడి, మాదేపల్లి, జాలిపూడి, చాటపర్రు, కాట్లంపూడి తదితర గ్రామాల్లో 2621 మంది ఖాతాల్లో రూ.1,74,53,000 జమ చేసింది. గతేడాది 2231 మంది ఖాతాల్లో ప్రభుత్వం రూ.1,67,32,500 జమ చేయగా ఇప్పుడు మరో రూ.5,21,000 పెరిగింది. లబ్ధిదారులు సంఖ్య మరో 390 మందిని పెంచింది. సుమారు 20 క్వింటాళ్ల విత్తనాలు సబ్సిడీపై అందించింది. ఎనిమిది రైతు సంఘాలకు చెందిన 40 మందికి ఉమ్మడిగా సుమారు రూ.60 లక్షలు ఖరీదు చేసే 8 ట్రాక్టర్లను అందజేసింది. ఇందు నిమిత్తం ప్రభుత్వం నుంచి రైతులు రూ.24 లక్షలు సబ్సిడీ పొందారు.



చొదిమెళ్ల ఆర్బీకే నుంచి ఎరువులు తీసుకెళ్తున్న రైతు

ఆర్బీకేల అండ

రైతు భరోసా కేంద్రాలు రైతులకు అండగా నిలిచాయి. ఏలూరు మండల గ్రామాలతో పాటు శనివారపుపేట, వెంకటాపురం, చొదిమెళ్ల, పోణంగి, కొమడవోలు, సత్రంపాడు, తంగెళ్లమూడిలో సైతం ప్రభుత్వం 28 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసింది. అన్ని కేంద్రాలు వ్యవసాయశాఖ సిబ్బందిని నియమించడంతో రైతులు తమ అనుమానాలు, అభిప్రాయాలను వారితో పంచుకునే అవకాశం ఏర్పడింది. దీంతో రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకున్నారు.

ధైర్యం ఇచ్చింది



సీఎం జగన్ ఎన్నిక హామీలన్నీ అమలు చేస్తున్నారు. మూడేళ్లగా వైఎస్సార్ రైతు భరోసా డబ్బుతో వ్యవసాయం చేస్తున్నా. ఈ పథకం రైతుల్లో ధైర్యం నింపింది. సాగు కోసం అప్పులు చేయాల్సిన పని లేదు. మా గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల రైతులు ధైర్యంగా సాగుపై దృష్టి నిలిపారు.

– అంకం రామకృష్ణ, చొదిమెళ్ల

సీఎంకు కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా నగదు అందుకుంటున్నాను. ఈ డబ్బుతో పెట్టుబడికి ఖర్చు చేస్తున్నాను. ఆర్బీకే ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వమే ఇస్తుంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటిస్తుంది.

– వేపూరి మెహర్‌బాబా, చొదిమెళ్ల

ఏటా లబ్ధిదారుల పెంపు



ప్రభుత్వం ఏటా వైఎస్సార్ రైతు భరోసా పథకం లబ్ధిదారులు సంఖ్య పెంచుతోంది. పథకం అందుకోలేకపోయిన రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కొత్త లబ్ధిదారులు అర్హతను పరిశీలించి నివేదిక అందిస్తున్నాం. అనంతరం కొత్త లబ్ధిదారులకూ పథకం అమలు చేస్తోంది.

– ఎ.జీవనసంధ్య, మండల వ్యవసాయ అధికారిణి

క్యాన్సర్‌ను నివారించవచ్చు



శిబిరంలో విద్యార్థులకు గుర్తింపు పత్రం అందజేస్తున్న వైద్యురాలు రాజ్యలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్యం అందించడం ద్వారా ప్రాణాపాయాన్ని నివారించవచ్చని గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యురాలు ఎం.రాజ్యలక్ష్మి అన్నారు. నగరానికి చెందిన అంటోనరి సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ తోట ఎడ్వర్డ్ ఆధ్వర్యంలో స్థానిక బీడీ కాలనీలోని సెయింట్ అంతోని పబ్లిక్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె వైద్య సేవలు అందించారు. క్యాన్సర్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముందుగా గ్రహించి పరీక్షలు చేసుకుంటే వైద్యంతో నివారించవచ్చని డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ప్రతి వ్యక్తీ ఆరోగ్య సూత్రాలను పాటించాలని, మంచి వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, వ్యాయామాలు చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా సోషల్ సర్వీస్ డైరెక్టర్ తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా బీడీ కాలనీలోని వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో సెయింట్ అంతోని స్కూల్‌కు చెందిన 350 మంది విద్యార్థులకు మరో 200 మంది స్థానికులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశామని చెప్పారు. శిబిరంలో డాక్టర్ ఎం.చంద్ర, డాక్టర్ అక్బర్ బాషా, పీఆర్‌ఓ పి.రాజు, మానవత సంస్థ కార్యదర్శి మేతర అజయ్ బాబు, కలతోటి డోమినిక్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం అందించాలి



ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసిన పీపీలు, ఏపీలు, న్యాయవాదులు

ఏలూరు (టూటౌన్): కోర్టుల్లో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 5వ అదనపు జిల్లా కోర్టు, మహిళా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా నియమితులైన డీవీ రామాంజనేయులు బుధవారం నానిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కోర్టులో ప్రభుత్వం తరపున నియమించే ఏపీపీలు, స్పెషల్ పీపీలు, జీపీ, ఏజీపీ పోస్టుల్లో 80 శాతంపైగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన న్యాయవాదులకే అవకాశం కల్పించి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని నాని చెప్పారు. కార్యక్రమంలో ఏపీపీలు ఆచంట వెంకటేశ్వరరావు, సీహెచ్ రాజేంద్రప్రసాద్, జీపీ డి.జగన్నాథరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పి.తంబి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు వీవీ సాయిరామారావు, కె.అర్జున్, బోడపాటి రాజు, స్టాన్లి పాల్గొన్నారు.

మహాకుంభాభిషేక మహోత్సవం ప్రారంభం



బాల అయ్యప్ప క్షేత్రంలో వాస్తు హోమం చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు బాల అయ్యప్ప స్వామి క్షేత్రంలో త్రయాహ్నిక దీక్షాక్రతియుత మహాకుంభాభిసేక సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమయింది. ఉదయం 9 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, రుత్విక్ వరుణ, దీక్షా ధారణ, పంచగవ్య ప్రాసన, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి విష్వక్సేన ఆరాధన పుణ్యాహవాచన, అజస్ర దీపారాధన, అంకురార్పణ, అగ్నిమదనం, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తుపూజలు చేశారు. వాస్తు హోమం, సర్వకుండేషు అగ్ని ప్రతిష్ఠాపన, నవగ్రహ హోమం, శాంతి హోమం నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను క్షేత్రం వ్యవస్థాపకుడు గుమ్మడిదల సీతారామయ్య పర్యవేక్షించారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ గొప్పది



ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం డైరీని విడుదల చేస్తున్న విజయ్‌కుమార్

ఏలూరు (టూటౌన్): భారతదేశ పంచాయతీరాజ్ వ్యవస్థ చాలా గొప్పదని ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ఆర్‌కే విజయ్‌కుమార్ అన్నారు. ఆయన జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ఆశ్రం కళాశాల సమావేశ మందిరంలో బుధవారం ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు న్యాయం, అభివృద్ధి, సంక్షేమం, విద్య తదితర 29 అంశాలను భారత రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చినట్టు చెప్పారు. ఇవి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సర్పంచులను వివక్షతతో కొందరు చూడటం బాధాకరమన్నారు. సర్పంచ్ పదవి అనేది రాజ్యాంగం హక్కని, ఈ పదవికి రాజకీయాలతో సంబంధం లేదని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం–2023 డైరీని విజయ్‌కుమార్ విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచులు బోదుల స్వరూప్, బయ్యే రాధారాణి లక్ష్మణ్, పాముల మాన్‌సింగ్, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ సభ్యులు మేతర అజయ్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.బాబురావు, కె.రామకృష్ణ, కె.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	28	ములక్కాడలు	10–12
బెండకాయలు	44	కంద	44
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	34
కాకర కాయలు	30–36	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	60
బీరకాయలు (పందిరి)	58	అల్లం	72
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	34	పాలకూర	08
దొండకాయలు	36	చుక్కకూర	08
బంగాళదుంపలు	18	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	40–48	బఠాణీ	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	33
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠా పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 14వ డివిజన్‌లో నిర్మించిన హనుమత్ సీతా లక్ష్మణ సహిత రామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 8 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన పూజలు, హారతి సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 4.30 గంటల నుంచి అంకురార్పణ, హోమాలు నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి హారతి సేవ, మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. వేద పండితుడు జంధ్యాల రాజేశ్వర శాస్త్రి విశేష పూజలు చేయగా, ఏలూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కార్పొరేటర్ దారపు తేజ, అనూష దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతికి కొవ్వొత్తులతో నివాళి



నాగులదేవునిపాడులో డాక్టర్ ప్రీతి చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

దెందులూరు: భవిష్యత్తులో ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా ఉండేందుకు చట్టాలను కఠినతరం చేయాలని బీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నాగులదేవునిపాడు బీఎస్ఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో మృతి చెందిన డాక్టర్ ప్రీతి చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆమె మృతికి కారకులైన వారికి యావజ్జీవ కారాగార శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కోర్టులు జోక్యం చేసుకుని నేరుగా దర్యాప్తుకు ఆదేశించాలన్నారు. బీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా సంతకాల సేకరణ చేస్తున్నామని, ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. తాము సేకరించిన సంతకాల జాబితాను రాష్ట్ర గవర్నర్‌కు త్వరలో అందజేస్తామన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెదవేగి : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామ కార్యదర్శులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పెదవేగి ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ సూచించారు. బుధవారం అన్ని గ్రామాల కార్యదర్శులు, సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను అనుసరించి ఫ్లెక్సీలను తొలగించాలని, లేనిపక్షంలో వాటిపై బరకాలు కప్పాలని సూచించారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలిండర్ ధర రూ.350లను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఇప్పటికే వంట గ్యాస్ ధర రూ.1105 ఉండగా, పెంచిన ధరతో కలిపి రూ.1155 చెల్లించాల్సి వస్తోందని, వాణిజ్య సిలిండర్‌పై ఒకేసారి రూ.350 భారం మోపడం దారుణమని పేర్కొన్నారు. ఇది చిరువ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఇప్పటికే కరోనా ఆర్థిక మాంద్యం వల్ల చితికిపోయిన ప్రజలు, స్వయం ఉపాధిదారులు పెంచిన గ్యాస్ ధరల వల్ల మరింత దుర్భర పరిస్థితికి చేరుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.

- కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కోకన్వీనర్ పత్తిపాటి రామకృష్ణలు ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2014లో కేంద్రం అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన భారాలను భారీగా మోపిందని గుర్తు చేశారు.

నేటి నుంచి ఆర్‌సీఈలో క్రేయ ఫెస్ట్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 2వ తేదీ నుంచి క్రేయ–23 పేరిట జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా టెక్నికల్ ఈవెంట్లు, సాంస్కృతిక పోటీలు, ప్రాజెక్ట్ ఎక్స్పో, మ్యాగజైన్ లాంచింగ్, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాల చివరి రోజు ప్రముఖ సినీ గాయకుడు డీఎస్పీ సాగర్ ఆధ్వర్యంలో సంగీత విభావరి ఏర్పాటు చేశామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ శ్రీపర్రు గ్రామానికి చెందిన మండవ వెంకటేశ్వరరావు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండవ వెంకటేశ్వరరావు కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, పిల్లలున్నారు. వెంకటేశ్వరరావు తరుచూ తన భార్యతో గొడవలు పడుతూ ఉంటాడు. మద్యం సేవించి బుధవారం ఉదయం భార్యతో గొడవపడపటంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. తీవ్ర మనస్థాపానికి గురైన వెంకటేశ్వరరావు ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ కొక్కిరాయలంక గ్రామానికి చెందిన యువకుడు రోడ్డుప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొక్కిరాయలంక గ్రామానికి చెందిన యు.భాస్కరరావు అనే యువకుడు చేపల లోడు పనులకు వెళుతూ జీవనోపాధి పొందుతున్నాడు. మంగళవారం తణుకులో వ్యక్తిగత పని మీద మోటారు సైకిల్‌పై వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా ఏలూరు రూరల్ ప్రాంతం మొండుకోడు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి ఏలూరు బోధనాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

సర్వసభ్య సమావేశం నిరవధిక వాయిదా

పెదవేగి : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను గౌరవిస్తూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిరవధిక వాయిదా వేసినట్టు ఎంపీపీ తాతా రమ్యకుమార్ అన్నారు.